
సాక్షి
నంద్యాల
సోమవారం, 16, అక్టోబర్, 2023



మహానందిలో సండే సందడి

మహానంది: విద్యా సంస్థలకు దసరా సెలవులు, అందులోనూ ఆదివారం, అలాగే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవడంతో మహానంది ఆలయం భక్తులతో కళకళలాడుతుంది.



331 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి ఆదివారం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రింగు కర్రలు స్వాధీనం

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాల నేపథ్యంలో అరికెర గ్రామంలో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించి 60 రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

నంద్యాల: కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మన జీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

848.30 అడుగులుగా డ్యామ్ నీటిమట్టం



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 848.30 అడుగులకు చేరుకుంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు శనివారం నుంచి ఆదివారం వరకు 10,547 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.183 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి 4,447 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి మల్యాల ఎత్తిపోతలకు 337 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,560, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,326 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 157 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 76.4876 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాలు మంజూరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాలు మంజూరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లాలో 968 పాఠశాలలకు మొదటి విడతగా 26,854 లైబ్రరీ పుస్తకాలు మంజూరయ్యాయని, త్వరలోనే పంపిణీ చేస్తామని రెండో విడత కూడా లైబ్రరీ పుస్తకాలు త్వరగా వస్తాయన్నారు.

పుష్కలంగా ఎరువులు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు తెలిపారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌సీఎల్ కంపెనీకి చెందిన ఎరువుల వ్యాగన్ నంద్యాల రైల్వేస్టేషన్ ర్యాక్ పాయింట్‌కు చేరుకోగా నంద్యాల ఏవో ప్రసాదరావుతో కలిసి డీఏఓ తనిఖీ చేశారు. మొత్తం 1748.385 టన్నుల యూరియా వ్యాగన్‌లో వచ్చిందని, ఇందులో 900 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మిగతా 837.90 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు అందిస్తున్నామన్నారు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డీలర్లు, ఆర్‌బీకేల వద్ద 10546.29 టన్నుల యూరియా, 7906 టన్నుల డీఏపీ, 4716 టన్నుల ఎంవోపీ, 21720 టన్నుల ఎన్‌పీకే కాంప్లెక్స్, 1072 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

జూనియర్ కాలేజీలకు 19 నుంచి సెలవులు

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జూనియర్ కళాశాలలకు ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు ఆర్ఐఓ గురవయ్య శెట్టి, డీవీఈవో జమీర్ బాషా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సెలవుల అనంతరం 26వ తేదీ కళాశాలలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఏ కళాశాలలో కూడా విద్యార్థులకు తరగతులు నిర్వహించకూడదని పేర్కొన్నారు. తరగతులు నిర్వహిస్తే సంబంధిత కళాశాలలపై ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

డిగ్రీ రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టులో జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఆదివారం ఒక ప్రటకనలో తెలిపారు. రీ వాల్యుయేషనకు 2,090 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,80 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఫలితాల కోసం విద్యార్థులు https:// rayalaseemauniversity.ac.in/ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

శ్రీశైలం.. ఉత్సవ శోభితం

- శ్రీగిరిలో వైభవంగా దసరా మహోత్సవాలకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా ఉత్సవాలకు అంకురార్పణ
- శైలపుత్రిగా భ్రామరీ, భృంగివాహనంపై మల్లన్న విహారం
- శోభాయమానంగా స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం



శైలపుత్రి, భృంగివాహనాధీశులను ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో దసరా ఉత్సవ శోభ అంబరాన్ని తాకింది. ఓ వైపు భ్రామరీ సమేత మల్లికార్జునుడికి విశేష పూజలు.. మరో వైపు కనుల పండవగా సాగిన గ్రామోత్సవం.. కళాకారుల సందడి మధ్య శ్రీగిరిలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, వేదపండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముందుగా శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు విరూపాక్షయ్యస్వామి, మధుసూదన్ రెడ్డి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, డా.సి.కనక దుర్గ, తన్నీరు ధర్మరాజు, మురళి, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రవేశం చేశారు. ఈ ఉత్సవాలకు నాందిగా ఉదయం 9గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, ఋత్విగ్వరణం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అఖండ దీపాస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, చండీకలశ స్థాపన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. దసరా మహోత్సవాలలో భాగంగా కుమారిపూజ నిర్వహించారు. రెండు నుంచి పదేళ్ల వయస్సు ఉన్న బాలికకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించారు. కుమారి పూజ నవరాత్రి ఉత్సవాల్లో ముఖ్యమైన సంప్రదాయం. పది రోజుల పాటు జరిగే దేవీ నవరాత్రోత్సవాలు ఈ నెల 24వ తేదీతో ముగియనున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు అమ్మవారికి నవదుర్గ అలంకరణలు, ప్రత్యేక నవావరణ పూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీహోమం, రుద్రహోమం, జపములు, పారాయణలు జరిపించబడుతున్నాయి.

> **నేడు శ్రీశైలంలో..**
> దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామిఅమ్మవార్లు మయూరవాహనంపై విహరించనున్నారు.

శైలపుత్రీ నమోస్తుతే..

దసరా నవరాత్రోత్సవాల్లో చేపడుతున్న నవదుర్గ అలంకారంలో భాగంగా మొదటి రోజు రాత్రి 7.30 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని శైలపుత్రి స్వరూపంలో అలంకరించారు. అమ్మవారి ఆలయం ముందు ప్రత్యేక వేదికపై శైలపుత్రి అలంకృతులైన అమ్మవారిని ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులిచ్చారు. పరాశక్తి నవదుర్గా రూపాలలో మొదటి స్వరూపం శైలపుత్రి. శరన్నవరాత్రుల తొమ్మిది రోజుల్లో మొదటి రోజు ఈ దేవిని పూజిస్తారు. వృషభాన్ని వాహనంగా ఉన్న ఈ దేవి ద్విభుజాలను కలిగి, కుడిచేతిలో త్రిశూలాన్ని, ఎడమ చేతిలో పద్మాన్ని ధరించి ఉంటుంది. నవదుర్గలలో ప్రథమ రూపమైన ఈ దేవిని పూజించడంతో విశేష ఫలితాలు కలగడంతో పాటు సర్వత్రా విజయాలు లభిస్తాయని, ముత్తైదువులకు ఐదవతనం వృద్ధి చెందుతుందని పురాణాల్లో చెప్పబడింది.

భృంగివాహనసేవలో స్వామిఅమ్మవార్ల దరహాసం

దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆదివారం శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవల్లో భాగంగా భృంగివాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి భృంగివాహనంపై ఉంచి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజాదికాలతో, హారతులిచ్చి గ్రామోత్సవానికి తరలించారు. ముందుగా ఆలయ ప్రదక్షిణ చేయించి కృష్ణదేవరాయ గోపురం మీదుగా రథశాల వద్దకు చేర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, తప్పెటలు, కళాకారుల నృత్యాల నడుమ గ్రామోత్సవం నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు సాగింది.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



విచిత్ర వేషధారణలో కళాకారులు



డోలు వాయిద్యకారుల విన్యాసం



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు



వీరభద్రుడి వేషధారణలో..

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, పలువురు అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చేదోడు పథకం కింద లబ్ధిదారులకు నాలుగో విడత ఆర్థిక సాయం విడుదల చేసేందుకు ఈనెల 19న ఎమ్మిగనూరు పట్టణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వస్తున్నారన్నారు. సభాప్రాంగణానికి లబ్ధిదారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీఎస్పీ సీతారామయ్య, తహసీల్దార్ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

చకచకా ఏర్పాట్లు..

సీఎం పర్యటనకు సమయం సమీపిస్తుండటంతో అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. స్పిన్నింగ్ మిల్లు మైదానంలో హెలిపాడ్ ఏర్పాటు, వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. వీఐపీ గ్యాలరీ, పార్కింగ్ తదితర అంశాలపై సూచనలిచ్చారు.

ఆర్‌యూలో ముగిసిన పీజీ కౌన్సెలింగ్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఆయా కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలించి సీట్లు కేటాయించామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన సీట్లు రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యే అవకాశముందని ఆయన తెలిపారు.

సబ్జెక్టు	మొత్తం సీట్లు	భర్తీ అయినవి
ఇంగ్లిష	39	8
తెలుగు	39	12
ఎకనామిక్స్	39	01
కామర్స్	55	5
బాటనీ	44	41
మాథమ్యాటిక్స్	39	25
స్టాటిటిక్స్	33	8
ఫిజిక్స్	39	13
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	30
బయో టెక్నాలజీ	44	30
జువాలజీ	55	41
ఆర్గానిక్ కెమిస్ట్రీ (ఎస్ఎఫ్)	33	30
కంప్యూటర్ సైన్స్	55	35

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ రాత పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులతో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్

కర్నూలు: రాయలసీమ జోన్ పరిధిలో ఎస్ఐ నియామకాలకు సంబంధించిన రాత పరీక్షలు ఆదివారం కర్నూలు నగరంలో ప్రశాంతంగా ముగిశాయి. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, కడప, నంద్యాల జిల్లాల ఎస్పీ సిద్ధార్థ కౌశల్, కె రఘువీర్‌రెడ్డి కర్నూలులోని 14 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. మొత్తం 8,521 అభ్యర్థులకు గానూ 8,392 మంది హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పేపర్ 3, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్ 4 పరీక్షలు జరిగాయి. ఆయా రూట్లలో స్ట్రాంగ్ రూమ్‌లు, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టారు. హాజరైన వారిలో 7,533 మంది పురుష అభ్యర్థులు, 859 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు.

కలిసొచ్చిన ఖరీఫ్

- మొక్కజొన్నలో దిగుబడులు అదరహో..!
- జిల్లాలో 1.14 లక్షల ఎకరాల్లో సాగు
- ఎకరాకు 30–33 క్వింటాళ్ల దిగుబడులు
- ఎకరాకు రూ.18 వేలు పెట్టుబడి
- ఊరిస్తున్న గిట్టుబాటు ధర
- క్వింటా రూ. 2 వేలు ధర
- ముమ్మరంగా కోత, నూర్పిడి పనులు



సొదరదిన్నె సమీపంలో మొక్కజొన్న దిగుబడులను ఆరబోసిన దృశ్యం

కోవెలకుంట్ల: ఈ ఏడాది మొక్కజొన్న సాగు రైతులకు అన్ని విధాలా కలిసోచ్చింది. విత్తన సమయంలో అదునుకు వర్షాలు కురవడం, వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న విస్తారంగా సాగైంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1.04 లక్షల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా రైతులు 1.14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో అత్యధికంగా 4,837 ఎకరాలు, నందికొట్కూరు డివిజన్‌లో 36,660, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో 17,620, నంద్యాల సబ్ డివిజన్‌లో 11,535, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో 4,980, డోన్ సబ్ డివిజన్‌లో 2,940 ఎకరాల్లో సాగైంది. 105 నుంచి 110 రోజులు పంటకాలం కాగా ప్రస్తుతం పైరు చేతికందింది. ఆయా ప్రాంతాల్లో మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా వస్తుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

ఎకరాకు 30 నుంచి 33 క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలో గతేడాది రైతులు 1.13 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మొదట్లో వర్షాభావం, పంట చేతికందే తరుణంలో అధిక వర్షాలు ప్రభావం చూపాయి. అన్నింటిని అధిగమించగా ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో సాగుకు అన్ని విధాలా కలిసొచ్చింది. దీనికి తోడు జిల్లాలో రైతులు పంట మార్పిడి విధానం అవలంభించి ఖరీఫ్ మొదటి పంటగా మొక్కజొన్నను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. సేద్యాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.18 వేలు వెచ్చించారు. విత్తన సమయంతోపాటు, పైరు వివిధ దశల్లో వర్షాలు సకాలంలో కురవడంతో వాతావరణం అనుకూలించి ఎకరాకు 30 నుంచి 33 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తోడు రైతులు చేపట్టిన పంటమార్పిడి విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు చేతికందాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 2 వేలు ధర పలుకుతుండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఏటా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే దిగుబడులను విక్రయిస్తుండటంతో రైతులకు దళారుల బెడద తప్పింది. జిల్లా వ్యాప్తంగా 20 రోజుల నుంచి మొక్కజొన్న, కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

వాతావరణం అనుకూలించింది



మొక్కజొన్న పంటకు ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా మారింది. విత్తనానికి ముందు, పైరు ఏపుగా పెరుగుతున్న దశల్లోనూ ఆశించిన స్థాయిలో వర్షం కురిసింది. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 1,992 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఎకరాకు 30 నుంచి 33 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వం క్వింటాకు రూ.2,020 మద్దతు ధర ప్రకటించింది. పెట్టుబడులు పోనూ రైతులకు ఆదాయం చేకూరుతుంది.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

ఆరు ఎకరాలు సాగు చేశా



ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.18 వేలు ఖర్చయ్యింది. వాతావరణం అనుకూలించడంతో కాపు బాగా కాసింది. రెండు రోజుల్లో కోత, నూర్పిడి పనులు చేపట్టాలి. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని భావిస్తున్నాను.

– రామసుబ్బయ్య, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఎకరాకు రూ.10 వేలు కౌలు చెల్లించి మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పైరు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులపై ఆశలు పెట్టుకున్నాను. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న దిగుబడులు విక్రయించాలి.

– ఉపేంద్ర, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

క్లుప్తంగా

పాముకాటుతో యువకుడి మృతి


మృతి చెందిన హరి ఓబులేసు

చాగలమర్రి: గొడిగనూరు గ్రామంలో ఓ యువకుడు పాముకాటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఓబులేసు, పెద్ద వీరమ్మ దంపతుల కుమారుడు హరి ఓబులేసు (24) ఆదివారం సొంత పొలానికి సాగునీరు కడుతుండగా పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు వెంటనే స్థానిక కేరళా ఆసుపత్రికి తరలించారు. కాగా విష ప్రభావంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త ఓబులేసు మృతి చెందగా, ప్రస్తుతం పాముకాటుతో కుమారుడు హరి ఓబులేసు మృతి చెందడంతో పెద్ద వీరమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు: హంద్రీనది సమీపంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కోడుమూరుకు చెందిన శ్రీవల్ల వీర, చింత వీరేష్, విజయ్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, రామకృష్ణ, రవి, రంగన్న ఉన్నట్లు చెప్పారు. వరల్డ్ కప్ క్రికెట్‌లో ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్‌మ్యాచ్ చూస్తూ బాల్ టూ బాల్ బెట్టింగ్ ఆడుతూ వీరి పట్టుబడినట్లు తెలిపారు. శనివారం జరిగిన ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్‌కు సంబంధించి డబ్బులు ఇచ్చిపుచ్చుకుంటుండగా దాడిచేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.1,52,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో మరికొందరి పాత్రపై విచారణ జరుపుతున్నామన్నారు.

నాటు తుపాకీతో వ్యక్తిపై హత్యాయత్నం

ఆళ్లగడ్డ: అహోబిలంలో నాటు తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చెంచుకాలనీకి చెందిన రామాంజనేయులు, మేకల నరసింహులు మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నరసింహులును అంతమొందించాలని రామాంజనేయులు కుట్రపన్నాడు. ఆదివారం నరసింహులు మరో వ్యక్తితో కలిసి కొండకు (ఫలసాయం తెచ్చుకునేందుకు) వెళ్లాడని తెలుసుకున్నాడు. సాయంత్రం వారు ఇంటికి తిరిగి వస్తున్న మార్గంలో తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో మాటు వేశాడు. ఇంతలో అడవిలో నుంచి ఇద్దరు వస్తుండగా రామాంజనేయులు నరసింహులను కాల్చేందుకు తుపాకీ ఎక్కు పెట్టాడు. గమనించిన నరసింహులు పక్కకు తప్పుకోగా తుపాకీ తూటా పక్కనున్న పెద్దన్న చేతికి తగలింది. గాయపడిన పెద్దన్నను ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు పోలీసు లు కేసు నమోదు చేసుకున్నారు. రామాంజనేయులు కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహానందిలో..


శైలపుత్రిదుర్గగా శ్రీకామేశ్వరీదేవి

మహానంది: శరణు...శరణు శ్రీ శైలపుత్రిదుర్గా అంటూ భక్తులు ప్రణమిల్లారు. మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శ్రీ శైలపుత్రిదుర్గగా మొదటిరోజు భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికుల బృందం శాస్త్రోక్త పూజల అనంతరం అమ్మవారిని సూర్యప్రభ వాహనంపై కొలువు చేసి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం చేపట్టారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో..


ఆదిలక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి

బేతంచెర్ల: దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా ఆదివారం వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ఉత్సవ పూజలు నిర్వహించి యాగశాల ప్రవేశం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు పాలక మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. గ్రామోత్సవ సేవలో ఆదిలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే హనుమద్వాహనం సేవ నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు చేపట్టారు.

అహోబిలంలో..


ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములకు నవకళస్థాపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అద్దాల మండపంలో కొలువుంచి ఊంజల్ సేవ చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిఘా నీడలో...

- నేటి నుంచి ఈవీఎంల ఫస్టు లెవల్ చెకింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాట్లు పూర్తి


రాజకీయ పార్టీలకు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఏడాది నిర్వహించే సాధారణ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా అతి ముఖ్యమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం)ల పనితీరు పరిశీలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఓటింగ్ పరికరాలైన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తోపాటు వీవీ ప్యాట్ల పనితీరును పరిశీలించేందుకు ఫస్టు లెవల్ చెకింగ్(ఎఫ్‌ఎల్‌సీ)ప్రక్రియకు సర్వం సిద్ధం చేసింది. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రక్రియను బెల్ కంపెనీకి చెందిన ఇంజినీర్లు చేపడతారు.

16 టేబుళ్ల ఏర్పాటు...

కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం, జిల్లాలోని కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటింగ్ పరికరాల పనితీరు, వాటి నిర్వహణ, ఇతర సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఫస్టు లెవల్ చెక్(ఎఫ్‌ఎల్‌సీ) చేపడుతోంది. ఇందులో భాగంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల పనితీరును పరిశీలిస్తారు. సాధారణ ఎన్నికల మాదిరిగా ఆయా పరికరాల పనితీరును పరిశీలిస్తారు. ఇందుకోసం బెల్ కంపెనీకి చెందిన 16 మంది ఇంజినీర్లను నియమించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగే ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ కోసం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో 16 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదట బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేస్తారు. అది కంట్రోల్ యూనిట్‌లో నిక్షిప్తం అవుతుంది. అదే సమయంలో ఓటు ఎవరికీ వేసింది వీవీ ప్యాట్లలో కనిపించేలా ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ కొనసాగుతుంది. ఎక్కడ ఏమాత్రం తేడా వచ్చిన అందుకు సంబంధించి కారణాలు, ఇతర ప్రక్రియలను చేపడతారు. కాగా, కర్నూలు జిల్లాకు 6,650 వీవీప్యాట్లు, 5,040 కంట్రోల్, 6,600 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు.

పకడ్బందీగా ప్రక్రియ

కేంద్ర ఎన్నికల సంఘం ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించింది. గోదాము లోపలికి సెల్‌ఫోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు. గోదాము మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. అంతేకాక ఈ సీసీ కెమెరాలను పోలీసు ప్రధాన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి అక్కడి నుంచి పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను మొత్తం వీడియో తీయించేలా చర్యలు తీసుకున్నారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా లైవ్‌ను ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. మరోవైపు ఈవీఎం గోదాము నుంచి పేపర్ ముక్క కూడా బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు కంట్రోల్ రూమ్‌ను కలెక్టరేట్‌లోని పాత జేసీ–2 కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో 8 మంది సిబ్బంది ఉండి ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తారు. వివిధ రిజిష్టర్లు, లాగ్ బుక్‌లను నిర్వహణను కంట్రోల్ రూం సిబ్బంది చేపడతారు. ప్రతి రోజూ రిజిష్టర్లను కలెక్టర్‌కు చూపించే బాధ్యత కంట్రోల్ రూమ్‌లలో పని చేసే సూపర్‌వైజర్లపై ఉంటుంది. ఈ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ఐడీ కార్డులను జారీ చేడయంతోపాటు ప్రత్యేక శిక్షణను ఇచ్చారు.

అధికారులకు గుర్తింపు కార్డులు


ఈవీఎం గోదాము సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో చేపట్టనున్న ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలసి పరిశీలించారు. గోదాములోకి సెల్‌ఫోన్లు, కెమెరాలను అనుమతించొద్దని, పేపర్ ముక్క కూడా బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పనిని ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు చేపట్టాలని సూచించారు. ఈ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. వారి వెంట డీఆర్వో కె.మధుసూదనరావు, ఆర్డీఓ హరిప్రసాదు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ ఉన్నారు.

ముగిసిన కేంద్రప్రభుత్వ ప్రతినిధి పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద చేనేత పట్టుచీరల తయారీని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ జిల్లా పర్యటన ఆదివారం ముగిసింది. ఉదయం 11 గంటల వరకు చేనేత, జౌళి శాఖ అధికారులతో పట్టుచీరల తయారీకి సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. చేనేత పట్టుచీరల తయారీ, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర వాటిపై జిల్లా అధికారులు వివరించారు. ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద చేనేత పట్టుచీరలకు జాతీయ స్థాయి అవార్డు లభించే విధంగా నివేదిక ఇస్తామని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ ఏడీ హరికృష్ణ, అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతి చెందిన మురళీఆచారి

కోడుమూరు రూరల్: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి ప్యాలకుర్తి వద్ద చోటు చేసుకుంది. మండలంలోని గోరంట్లకు చెందిన మురళీ ఆచారి (25) అనే వ్యక్తి భార్య పుట్టినిల్లు అయిన గూడూరుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వైపు వెళుతూ ప్యాలకుర్తి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళుతున్న మురళీ ఆచారి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక..


మృతి చెందిన పెద్దబాలన్న (ఫైల్)

మహానంది: కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందిపల్లె గ్రామానికి చెందిన మందా పెద్ద బాలన్న(43) బంధువుల వద్ద సుమారు రూ. 2 లక్షలు అప్పులు చేశాడు. కొద్దిరోజులుగా ఆందోళనకు గురికాగా భార్య మంగమ్మ నచ్చచెబుతూ వచ్చింది. అయితే ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటికి వచ్చి తిమ్మాపురం గ్రామానికి చేరుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. కుటుంబీకులు, బంధువులు తిమ్మాపురం చేరుకుని అంతటా గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా ఓ పాఠశాల వెనుక ఉన్న డొంగు కాల్వ వద్ద ఆదివారం దుర్వాసన వస్తుండంతో స్థానికులు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా మృతుడు పెద్దబాలన్నగా గుర్తించారు. పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. బాలన్నకు భార్య మంగమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

షుగర్ రోగుల సంఖ్య పెరగడం ఆందోళనకరం

- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): షుగర్ రోగుల సంఖ్య పెరగడం ఆందోళనకరమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి అన్నారు. రీసెర్చ్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటీస్ ఇన్ ఇండియా(ఆర్‌ఎస్‌ఎస్‌డీఐ) నేతృత్వంలోని ఏపీ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజిలోని న్యూ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ.. తీసుకునే ఆహారానికి తగిన శ్రమ చేయకపోవడం వల్లే ఊబకాయం పెరిగి షుగర్ వస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికి వలంటీర్లు, ఏఎన్‌ఎంలు వెళ్లి రక్తపరీక్షలు చేయడంతో కొత్తగా మరి కొంత మంది షుగర్ రోగులు వెలుగులోకి వస్తున్నారన్నారు. వారికి వ్యాధిని అదుపులో ఉంచుకోవడం, నియంత్రణ, నివారణ పద్ధతుల గురించి వివరించి చెప్పాలని వైద్యులకు సూచించారు. వైద్యులతో పాటు ప్రతి ఒక్కరూ షుగర్ వ్యాధి నియంత్రణకు పాటుపడాలని, తద్వారా వచ్చే దుష్పరిమాణాలను పెరగకుండా చూడాలని చెప్పారు. అనంతరం ఎండోక్రైనాలజి హెచ్‌ఓడి, కార్యక్రమం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. శ్రీనివాసులు, డాక్టర్ తిరుమలాచారి మాట్లాడారు. ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనే డయాబెటీస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆహార, ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం లాఫింగ్ థెరపీద్వారా షుగర్ చికిత్సపై డాక్టర్ వివి. రామ్‌కుమార్, ఆధునిక మందుల ప్రభావంపై డాక్టర్ వై. సదాశివరావు, డాక్టర్ అశోక్ వెంకట నరసు, యువతలో షుగర్ వ్యాధిపై డాక్టర్ మైథిలి, రివరల్స్ డయాబెటీస్‌పై డాక్టర్ నీలవేణి, షుగర్ వ్యాధిగ్రస్తుల్లో చర్మసమస్యలపై డాక్టర్ సీహెచ్. మౌనికా అనిత, షుగర్ వ్యాధిగ్రస్తులకు డైట్‌తో నియంత్రణపై డాక్టర్ జానకి శ్రీనాథ్ వివరించారు. కొత్తగా ఆవిష్కృతమైన ఇన్సులిన్‌లపై డాక్టర్ రాకేష్ సహాయ్, షుగర్ ద్వారా కిడ్నీపై ప్రభావంపై డాక్టర్ ఫరాజ్ ఫరిష్టా, మెటిఫార్మిన్ మందుతో పీసీవోడి నియంత్రణ గురించి డాక్టర్ సురేష్, గర్భవతుల్లో వచ్చే షుగర్‌పై డాక్టర్ లక్ష్మినళిని, జీర్ణకోశాల్లో షుగర్ సమస్యలపై డాక్టర్ అలోక్ సచన్, డయాబెటీస్ ఫుట్‌పై డాక్టర్ శ్రీనివాసులు, షుగర్ వ్యాధిగ్రస్తుల్లో కృంగుబాటు(డిప్రెషన్)పై డాక్టర్ శివశంకర్‌రెడ్డి ప్రసంగించారు.

దేశ ప్రగతిలో మహిళలు భాగస్వాములు కావాలి

- అసిస్టెంట్ కమాండెంట్ పీఆర్ సాహు
- కర్నూలుకు చేరుకున్న యశస్వినీ సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్ల బైక్ ర్యాలీ


మహిళా సాధికారతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా జవాన్లు, విద్యార్థినులు

కర్నూలు(అర్బన్): దేశ ప్రగతిలో మహిళలు భాగస్వాములు కావాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పీఆర్ సాహు పిలుపునిచ్చారు. 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది అక్టోబర్ 3న కన్యాకుమారి నుంచి గుజరాత్ వరకు ప్రారంభించిన మహిళా జవాన్ల బైక్ ర్యాలీ ఆదివారం కర్నూలుకు చేరుకుంది. ఈ ర్యాలీకి ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీసీపీఓ శారద తదితరులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మహిళా సాధికారతపై సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతం జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పీఆర్ సాహు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంతో ప్రజల్లో అవగాహనను మరింత విస్తృత పరుస్తున్నట్లు చెప్పారు. మహిళల సాధికారత, సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 75 బైక్‌లపై 150 మంది మహిళా జవాన్లతో ప్రారంభమైన ఈ ర్యాలీ గుజరాత్‌లోని కేవడియా ప్రాంతంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు సాగుతుందన్నారు. అనంతరం మహిళా సాధికారతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ మహిళా అధికారిణులు రమ, తులసి, డీసీపీఓ, సీడబ్ల్యూసీ సభ్యులు సుధాకర్, డీపీఓ దేవకర్, అబ్జర్వేషన్ హోమ్ పర్యవేక్షకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

వర్షాధార ప్రాంతాల్లో పంటల సాగుపై అవగాహన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మహదేవయ్య

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధార ప్రాంతాల్లో ఎటువంటి పంటలు సాగు చేసుకోవచ్చనే దానిపై అవగాహన పెంచుకొని రైతులకు తెలియచెప్పాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త కే.మహదేవయ్య తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షధార ప్రాంతాల్లో సాగు చేయాల్సిన పంటల ప్రణాళికపై ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా వివిధ వృత్తులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. విపత్కర, బెట్ట పరిస్థితులు ఏర్పడినపుడు పంటలను కాపాడుకునేందుకు పాటించాల్సిన పద్ధతులను తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వాలుకు అడ్డంగా దున్నటం, తల్లిసాలు ఏర్పాటు చేయటం, అంతర పంటల సాగు వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కోర్సు సమన్వయకర్త జయచంద్ర , వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ప్రేమోన్మాది వేధింపులకు యువతి బలి!


లక్ష్మి (ఫైల్)

కౌతాళం: ప్రేమోన్మాది వేధింపులకు ఓ యువతి బలైంది. ఈ దుర్ఘటన కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సూర్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల మేరకు జీవప్ప, మల్లమ్మల కుమార్తె లక్ష్మి (21) కూలి పనులకు వెళ్తోంది. తనను ప్రేమించాలని అగసలదిన్నె గ్రామానికి చెందిన నాగప్ప వేధించేవాడు. తననే పెళ్లి చేసుకోవాలని పొలాలకు వెళ్లి బెదిరించేవాడు. ఈ విషయం తెలిసిన పెద్దలు మందలించినా అతనిలో మార్పు రాలేదు. నాగప్ప తమ కుటుంబం పరువు ఎక్కడ తీస్తాడో అన్న భయంతో లక్ష్మి శుక్రవారం సాయంత్రం నుంచి కనబడకుండా పోయిందని, ఈ విషయాన్ని శనివారం ఉదయమే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మల్లమ్మ తెలిపారు. మిస్సింగ్ కేసు కూడా నమోదు చేశారని అయితే ఆదివారం ఉదయం నీటి కుంటలో తన కుమార్తె శవం కనిపించిందన్నారు. తన కూతురు ఆత్మహత్యకు కారణమైన నాగప్పను కఠినంగా శిక్షించాలని మల్లమ్మ కోరింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు: నంద్యాల జిల్లా డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన అవుల మద్దిలేటి (35) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆరు నెలల క్రితం పిల్లల చదువుల కోసం మద్దిలేటి, అవుల లక్ష్మీ దంపతులు కర్నూలుకు వలస వచ్చి కృష్ణానగర్ ఐటీసీ సమీపాన ఇంటిని అద్దెకు తీసుకుని ఉండేవారు. భార్య లక్ష్మీదేవి ఇళ్లలో పాచిపని చేస్తూ జీవనం చేస్తుండగా మద్దిలేటి స్వగ్రామం మల్కాపురం నుంచి తరచూ వచ్చి వెళ్లేవాడు. నెల రోజుల క్రితం మోటార్ సైకిల్‌పై కర్నూలుకు వస్తూ ఉలిందకొండ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో, ఆ తర్వాత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది మందులు వాడుతుండేవాడు. తలకు ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సలహా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం డబ్బులు లేవని, ఆపరేషన్ వాయిదా వేయించుకుని ఇంటి దగ్గరే ఉండేవారు. శనివారం రాత్రి ఇంట్లో కళ్లు తిరిగి కిందపడడంతో ముక్కు నుంచి రక్తం కారుతుండగా కుటుంబ సభ్యులు ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన భర్త తలకు గాయాలై ఆపరేషన్ చేయించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే స్పృహతప్పి కింద పడి చనిపోయాడని భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన వినికిడి లోపం

- రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్

మహానంది: వినికిడి లోపమే అతని మరణానికి శాపమైంది. వ్యవసాయ పనులు చేసుకునే వ్యక్తి రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన మహానంది మండలం గోపవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాచర్ల బ్రహ్మానాయుడు(43) ఇంటికి సమీపంలో రైల్వేట్రాక్ ఉంది. అయితే ఆయన నిత్యం సమీపంలోని బయలుప్రదేశం వద్దకు బహిర్భూమికి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన రైలు వస్తున్న శబ్దం వినపడలేదు. దీంతో రైలు ఢీకొని ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

కర్నూలు(హాస్పిటల్)/నంద్యాల టౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.

మండలం/పట్టణం	వైద్యశిబిరం
ఎమ్మిగనూరు	కలుగొట్ల
వెల్దుర్తి	వెల్దుర్తి–3
తుగ్గలి	ఉప్పర్లపల్లి
మంత్రాలయం	వగరూరు–2
కర్నూలు	ఎన్‌టీఆర్ కాలని యుపీహెచ్‌సీ
కర్నూలు	ఆర్‌కె. దుద్యాల
కౌతాళం	ఎరిగేరి
కోడుమూరు	గోరంట్ల–1
కల్లూరు	బొల్లవరం
గూడూరు	జులేకల్
గోనెగండ్ల	గోనెగండ్ల–2
సి.బెళగల్	కొత్తకోట–2
ఆలూరు	ఆలూరు–2
ఆదోని	పెద్దతుంబళం
నంద్యాల జిల్లా...	
శిరివెళ్ల	జినేపల్లె
అవుకు	రామాపురం– 2
ప్యాపిలి	ఎస్.రాచర్ల
చాగలమర్రి	ముత్యాలపాడు –1
పాములపాడు	ఎర్రగూడూరు
నంద్యాల	మిట్నాల
ఆళ్లగడ్డ	కోటకందుకూరు
బనగానపల్లె	ఎర్రగుడి
డోన్	కమలాపురం
ఆత్మకూరు	బాపనాతపురం
నంద్యాల	యూపీహెచ్‌సీఎస్ జిబ్బో కాలనీ

క్లుప్తంగా

ట్యాంకర్ తొలగింపు



డివైడర్ నిర్మాణానికి ట్రాక్టర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

నంద్యాల(సిటీ): పట్టణంలో సంజీవనగర్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు డివైడర్ క్యూరింగ్ కోసం నీళ్లు పట్టడానికి ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్‌ను మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించి, ట్రాక్టర్ ఇంజిన్‌తో నీటిని పట్టేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ట్యాంక్ తొలగించరూ!' అనే కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్‌ను తొలగించడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పాయి.

మార్కెట్ అభివృద్ధికి సహకరించండి



వ్యాపారులతో మాట్లాడుతున్న కలాంబాషా

నంద్యాల(సిటీ): పట్టణంలోని కూరగాయల మార్కెట్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర ఎస్ఎస్ఎంఈ డైరెక్టర్ కలాంబాషా కోరారు. ఆదివారం మార్కెట్‌ను సందర్శించి మార్కెట్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. వ్యాపారాలు రోడ్లపైన చేసుకోకుండా తమకు కేటాయించిన షెడ్లలో చేసుకోవాలన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదరెడ్డి, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న దివ్యాంగులు

నంద్యాల(అర్బన్): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి తెలిపారు. అబ్దుల్‌కలాం 92వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు కిరణ్‌కుమార్, జిలానీ, వినోద్, నబిరసూల్, ఆరీఫ్, చాంద్‌బాషా పాల్గొన్నారు. అలాగే.. స్థానిక పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీధర్, కన్నయ్య, మణిశేఖర్‌రెడ్డి, కవులు నరేంద్ర, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, మహబూబ్‌బాషా, నీలం వెంకటేశ్వర్లు, రఫీ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్‌లో భాగంగా చేతుల శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ క్రాంతి పథం వీఓఏలు, గ్రామైక్య సంఘం సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది..మహిళలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఏడు రకాలుగా చేతులు శుభ్రం చేసుకోవడాన్ని వివరించారు. అలాగ చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

నంద్యాల(అర్బన్): ఏపీ వైఎస్సార్ క్రాంతి పథం వీఓఏల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుదాసు తెలిపారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఆదివారం వీఓఏల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పది లక్షల ఇన్సూరెన్స్, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు, వీఓఏల అకౌంట్‌కే వేతనాల మంజూరు తదితర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. నంద్యాల జిల్లా యూనియన్ నిర్మాణానికి వీఓఏలు కృషి చేయాలని, ప్రభుత్వం నుంచి అన్నింటిని తెచ్చుకునేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరసింహులు(రుద్రవరం), ఉపాధ్యక్షులుగా లత(ప్యాపిలి), ప్రధాన కార్యదర్శిగా రాజు(మిడుతూరు), కోశాధికారిగా ప్రమీల(మహానంది)తో పాటు పలువురిని ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, మద్దిలేటి, రామలింగప్ప, లోక్‌నాథరెడ్డి, భాస్కరనాయుడు, రాజబాబు, పుల్లన్న, రత్నం, జైపాల్ పాల్గొన్నారు.

దేవీ నమోస్తుతే

దసరా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు చేపట్టి సాయంత్రం వివిధ రూపాల్లో అలంకరించి మండపాల్లో కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం
- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- తొలిరోజు విశేష పూజలు చేపట్టిన నిర్వాహకులు
- తరలివచ్చిన భక్తజనం



శిరివెళ్లలో వరలక్ష్మీ దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

శిరివెళ్ల: మండలంలో శిరివెళ్ల,గోవిందపల్లె,యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె, మహదేవపురంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వంకదార ఈశ్వరయ్య, కార్యదర్శులు నాగేళ్ల నాగరాజు, రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మేడా రామకృష్ణ పాల్గొన్నారు.



రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి నవరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. ఆర్యవైశ్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారికి పురోహితులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. మొదటిరోజు అమ్మవారిని పార్వతీ దేవిగా అలంకరించి ఆలయ మండపంలో కొలువు దీర్చారు. గ్రామంలోని ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఉయ్యాలవాడ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు ఇంజేడులో చౌడేశ్వరి దేవి బాలత్రిపురా సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.



దొర్నిపాడు: మండల కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఆదివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



చాగలమర్రి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముత్యాలపాడు గ్రామంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని అమ్మవారి ఆలయంలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి దేవి మొదటి రోజు భక్తులకు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చకులు బణగానపల్లె రవికుమార్ వేద మంత్రోచ్చారణలతో ఉదయం కళశ స్థాపన, గంగానయనం, గణపతి పూజ, స్వస్తి వచనం, మాతృకా పూజ, పంచగవ్య ప్రాసన, రక్షాబంధనం, రుతిగ్వరణం, నవగ్రహ కళశ స్థాపన, అంకురారోపణం, ప్రధాన కళశములో దేవతా ఆవాహణ, ఆదిత్యాది నవగ్రహ జపములు, మహానైవేద్యం, మహామంగల హారతి, మంత్ర పుష్పం, రాజరాజేశ్వరిదేవి అలంకారం కార్యక్రమాలు జరిపించారు.

శైల పుత్రిగా కాశీవిశాలాక్షి



ఉప్పరిపేటలో దుర్గాదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలో మొదటి రోజు ఆదివారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి గణపతిపూజలు, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, అంకురారోహణ, నవగ్రహ పూజలు, రాహుకాల పూజలు, కంకణధారణ, స్వామి, అమ్మివార్లకు విశేష పూజలు, పూలంగిసేవ కార్యక్రమాలు, లలితా సహస్రనామాలు, వేదపారాయణాలు, హోమాలు, గోపూజలు నిర్వహించి సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో బాలత్రిపుర సుందరిగా, శైల పుత్రి, కామాక్షి దేవి, శ్రీమాంగళ్యగౌరీదేవిగా అలంకరించి కొలువుంచగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



- కాళికాంబ దేవస్థానంలో కాళికాంబదేవికి ఉదయం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక మండపంలో మాంగళ్యగౌరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



- మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి మూలవిరాట్‌కు ఉదయమే పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కలశస్థాపన, దేవీ పారాయణం, నవగ్రహ యంత్ర జపాదులు, మూలమంత్ర జపాదులు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక మండపంలో బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. బాలాజీ కాంప్లెక్స్‌లో అమ్మవారిని కామాక్షిదేవిగా అలంకరించారు.



- సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. శివాలయంలోని కాశీవిశ్వనాథునికి, కాశీ విశాలాక్షికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక మండపంలో శైల పుత్రిగా అలంకరించారు.
- జగజ్జననీ దేవాలయంలో మొదటిరోజు అమ్మవారి మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక రాహుకాల పూజలు జరిపించారు.



- మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు, దేవీ పారాయణం, సహస్ర నామాలు నిర్వహించారు. అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.



- బొమ్మల సత్రం షిర్డిసాయి దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని పార్వతి దేవిగా అలంకరించారు.



- రెవెన్యూ క్వార్టర్స్‌లో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.
- బాల్కొండ హాల్ వీధిలో భక్తులు దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.



- బ్రహ్మానందీశ్వరస్వామికి ఉదయన్నే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పార్వతీదేవికి పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీమహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని శైలపుత్రి, శ్రీబాలత్రిపుర సుందరిగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.



నందమూరినగర్‌లో బాలా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

పర్యాటక ప్రాంతంగా చిన్న చెరువు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల (సిటీ): పట్టణంలోని చిన్న చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ శివారులోని చెరువు కట్టపై నిర్మిస్తున్న పార్క్, రెస్టారెంట్ పనులను గ్రీన్ కో సంస్థ ప్రతినిధులతో కలసి పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని వారికి సూచించారు. ఆయన మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో నంద్యాల ఒకటని, ఇక్కడ సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పట్టణానికి అత్యంత సుందరమైన విజిటింగ్ స్పాట్‌గా చిన్న చెరువును తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామని చెప్పారు. అంతే కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పనులు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే పార్కులో ప్రత్యేక వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు, ల్యాండ్ స్కేపింగ్, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. అత్యాధునిక వసతులతో కూడిన రెస్టారెంట్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. బోటింగ్ చేసేందుకు వీలుగా మోటార్ బోట్లు, పెడల్ బోట్లు అందుబాటులోకి తెస్తామని వివరించారు.

జగనన్న సురక్ష క్యాంపుల్లో మార్పులు

నంద్యాల(సిటీ): పట్టణంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో మార్పులు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. వాటి వివరాలు ఇలా..

తేదీ	వార్డు	శిబిరం ఏర్పాటు చేసే స్థలం
16	విశ్వనగర్	ఎన్‌జీఓస్ కాలనీ
	చాంద్‌బాడ	హరిజనవాడ అర్బన్ హెల్త్ సెంటర్
17	ముల్లాన్‌పేట	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
	రైతునగరం/ఏకలవ్యనగర్	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
19	నీలివీధి	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
	లలితానగర్	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
20	భైర్మల్‌వీధి	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
	సాదిక్‌నగర్	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
26	ఎన్‌జీఓస్ కాలనీ	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
	హరిజనవాడ	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
27	పొన్నాపురం-2	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
	నడిగడ్డ-1	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
	నందమూరినగర్	వైఎస్సార్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్
28	మాల్దారిపేట	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
	ఎస్‌బిఐ కాలనీ	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
	పార్కురోడ్డు	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
30	తెలుగుపేట	హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్
	పొన్నాపురం	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
	నడిగడ్డ-2	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
31	నూనెపల్లె	ఎన్‌జీఓస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్
	జగజ్జననీనగర్	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
నవంబర్ 2	వైఎస్సార్ నగర్	వైఎస్సార్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్
	ఫరూక్‌నగర్	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
3	బాల్కొండహాల్	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్
4	గుడిపాటిగడ్డ	ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్

నాణ్యత లేకుండా నిర్మించడంతోనే కట్ట కుంగింది

నందికొట్కూరు: టీడీపీ పాలనలో అలగనూర్ రిజర్వాయర్‌ను నాణ్యత లేకుండా నిర్మించడంతోనే బండ్ కుంగిపోయిందని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రిజర్వాయర్‌ను నిర్మిస్తే.. జగనన్న కూల్చారని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రిజర్వాయర్ నిర్మాణానికి పునాది వేస్తే, చంద్రబాబు పాలనలో సోమ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చి పని చేయించారని గుర్తు చేశారు. కట్ట నిర్మాణానికి నాణ్యమైన మట్టి వాడకుండా ఇష్టానుసారంగా అక్కడే ఉన్న మట్టి వాడడంతో కూలిపోతే జగనన్న ప్రభుత్వానికి అంటగట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు కింద రిజర్వాయర్ బండ్ కుంగినచోట రూ. 5 కోట్లతో పనులు చేసినట్లు చూపి, దోచుకుని ఇసుక సంచులు వేశారని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో జరిగిన తప్పిదాలను జగనన్న పాలనలో జరిగినట్లు తప్పుడు కథనాలు రాయడం సిగ్గుచేటన్నారు. కట్ట కుంగిన చోట భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా బలంగా నిర్మాణం చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు.

శివాజీ గోపురంపై నాగుపాము

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉత్తరగోపురమైన శివాజీగోపురంపై శనివారం నాగుపాము ప్రత్యక్షమైంది. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలోని అన్ని గోపురాలకు విద్యుద్దీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా శివాజీగోపురానికి విద్యుద్దీకరణ చేసేందుకు కూలీలు గోపురంపైకి ఎక్కగా పాము కనిపించింది. దేవస్థాన అధికారులు అటవీశాఖ స్నేక్ క్యాచర్ కాళీచరణ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలేశారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రా సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

నేడు జీనేపల్లెలో ఆరోగ్య సురక్ష

శిరివెళ్ల: ఈ నెల 16వ తేదీన మండలంలోని జీనేపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్ర ఆదివారం తెలిపారు. జీనేపల్లె, పార్వతీపురం, బీవీఎస్ నగర్‌లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే పూర్తి చేశారన్నారు. వైద్య నిపుణులతో వివిధ వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కో కన్వీనర్ సోమన్న మాట్లాడుతూ నవంబర్ 18,19 తేదీల్లో పట్టణంలో మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు.

స్టీల్ ప్లేట్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నూరు యూపీ స్కూల్ విద్యార్థులకు 150 స్టీల్ ప్లేట్లను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కండె హరినాథ్, నాగమణి దంపతుల సహకారంతో విద్యార్థులకు చేయూతనందించామన్నారు. ఇప్పటి వరకు 800 ప్లేట్లను జిల్లాలో పలు పాఠశాలలకు పంపిణీ చేశారని, ఇంకా పది పాఠశాలలకు ఇవ్వాల్సి ఉందన్నారు. శ్రీరామమూర్తి, కైలాసనాథరెడ్డి, సుబ్బరామయ్య, జయకృష్ణ, సుధామోహన్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని కుందూనదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం నదిలో తేలియాడుతోందని స్థానికులు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని, కుడిచెయ్యిపై శివలింగం, ఓం అని పచ్చ పొడిపించుకున్నాడు. పింక్ కలర్, తెల్లని నిలువు అడ్డగీతల చొక్కా ధరించాడని చెప్పారు. వివరాలకు నంద్యాల తాలూకా సీఐ సెల్ 9121101092 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం



చాగలమర్రిలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: నిరుపేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నారాయణపల్లె రస్తాలోనున్న జగనన్న కాలనీలో పూర్తయిన పక్కా గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఖాజీ.మహబూబ్‌బీ, ఖాజీ ఖాజాపీర్‌ను అభినందించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం 14 టవర్లు టిడ్కో ఇళ్లను అసంపూర్తిగా, సదుపాయలు లేకుండా నిర్మించారన్నారు. జగనన్న ప్రభుత్వం 16 టవర్లను నిర్మించి పూర్తి స్థాయిలో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలను ఏర్పాటు చేసి లబ్దిదారులకు పంపిణీ చేయటానికి సిద్ధం చేసిందన్నారు. వారు కేవలం వాగ్దానాలు మాత్రమే ఇస్తారని, అమలును గాలికొదిలేస్తారని ఎద్దేవా చేశారు. స్కిల్ కుంభకోణంలో పూర్తిగా ఇరుక్కుపోయి, ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని, ఇంది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. చాగలమర్రిలో 5 జగనన్న కాలనీల్లో సుమారు 1500 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్లను నిర్మిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, చక్రం షబ్బీర్, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, ప్రచార కార్యదర్శి రఫీ, ఎంపీటీసీలు కె.లక్ష్మీరెడ్డి, ఎం.ఫయాజ్, ఎం.షేక్షావలి పాల్గొన్నారు.

దస్తగిరి స్వామికి ప్రత్యేక పూజలు..

పెద్దవంగళి గ్రామంలో వెలసిన శ్రీదస్తగిరి స్వామిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జెఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ జనార్ధనరావు నిర్వహించిన కందోరీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానం చేశారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం మానుకోవాలి

నంద్యాల(అర్బన్): చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రముఖ వైద్యులు, జైళ్ల శాఖ డీఐజీ చెబుతున్నా టీడీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ విమర్శించారు. చంద్రబాబు బరువు తగ్గి ఆరోగ్యం క్షీణించిందంటూ పచ్చపత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని టీడీపీ నాయకులు తప్పు పట్టడం సరికాదన్నారు. బరువు తగ్గాడంటూ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదంటూ వైద్యులు, జైళ్ల శాఖ అధికారులు చెబుతున్నా ప్రభుత్వంపై విషప్రచారం చేయడం సరికాదన్నారు. చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడు కాబట్టే సీబీఐ జైలుకు పంపిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని, తాత్కాలిక రాజధాని పేరిట ప్రజాధనాన్ని జేబులు నింపుకున్నారని ఆరోపించారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఆత్మకూరు: ఓపెన్ స్కూల్ విద్యార్థులకు స్కిల్‌హబ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్లను ఆదివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 10 నుంచి ఓపెన్‌స్కూల్ విద్యార్థులకు స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం వివిధ సెంటర్లలో నిర్వహిస్తున్న సీపీపీ క్లాసులు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా ఉపాధి రంగంలో రాణించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం , ఆత్మకూరు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కు చెల్లింపులో భాగంగా పలువులు భక్తులు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.